క్లుప్తంగా

ధైర్యసాహసాలకు నిలువుటద్దం టంగుటూరి



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చెరుకూరి ప్రసాద్ తదితరులు

ఉండ్రాజవరం: ధైర్యానికి, సాహసానికి నిలువెత్తు నిదర్శనం టంగుటూరి ప్రకాశం పంతులు అని మోర్త ఉన్నత పాఠశాల తెలుగు భాష ఉపాధ్యాయులు చెరుకూరి వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశం పంతుల బాల్యం, చదువు, ప్రజాసేవ, రాజకీయ జీవితం, ప్రకాశం జిల్లా ఏర్పాటు తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాసరావు, రిసోర్స్‌పర్సన్ పి.రామదాసు, గ్రంథాలయ అధికారి గుత్తికోండ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ఎంపిక

నిడదవోలు: కామాక్షి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీని స్థానిక విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో సోమవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా గొల్తి రామ బ్రహ్మం, గౌరవ అధ్యక్షుడిగా పాడుగు శ్రీరామ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా నాగోజు వీర సత్యనారాయణ, కోశాధికారిగా లావేటి జేజి శివన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా కొమ్మోజు చంద్రశేఖర్, సహాయ కార్యదర్శిగా పాడుగు నరేష్‌తో పాటు, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ధ్యానంతో ఏకాగ్రత



విద్యార్థులకు ధ్యానంపై వివరిస్తున్న విశ్వనాథం

పెరవలి: విజ్ఞానం అనేది గ్రంథాలయాల్లో మాత్రమే లభిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా సోమవారం ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టారు కరుటూరి విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు, ధ్యానం నేర్చుకుంటే వారికి జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే యోగా వల్ల శరీరం అదుపులో ఉంటుందని, దీనివల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ధ్యానంతో చదువుపై ఏకాగ్రత పెరిగి, ఉన్నత స్థితికి వెళ్లవచ్చన్నారు. పుస్తక పఠనం చేయటం ద్వారా సమాజంలో మంచిచెడులు తెలుస్తాయని చెప్పారు. ప్రతి రోజు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మరో లైబ్రేరియన్ సలాది సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయ భూముల వేలం వాయిదా

తాళ్లపూడి: దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలోని వేగేశ్వరపురంలో ఉన్న శ్రీఛాయా సోమేశ్వరస్వామి ఆలయ భూముల కౌలుకు సోమవారం వేలం వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ వేలాన్ని వాయిదా వేసినట్టు ఈఓ సోమాల శివ ప్రకటించారు. కౌలు వేలానికి తగినంత మంది హాజరు కాకపోవటం, కౌలు పెంచాలన్న డిమాండ్ కూడా కారణమని చెప్పారు. ఆలయానికి సంబంధించిన భూమి 6.86 ఎకరాలను కొన్నేళ్లుగా సంకాబత్తుల రామకృష్ణ, తైలం వీర వెంకటరావు, మామిడాల బుజ్జి సాగు చేసుకుంటున్నట్టు వివరించారు. మిగిలిన 10.85 ఎకరాలు అర్చకుల ఆధీనంలో ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుత వేలం పాటలో మొత్తం దేవస్థానం భూములన్నీ రైతులకు అప్పగించి, వాటి కౌలు ఎక్కువ వచ్చేలా చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. గత కొంత కాలం అర్చకులకు జీతాలిచ్చేలా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఎకరాకు రూ.18 వేలు కౌలు మాత్రమే వస్తుందని, దానిని రూ.30 వేలకు పెంచాలని గ్రామస్తులకు తెలియజేశామన్నారు. త్వరలో వేలం తేదీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభం

నిడదవోలు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభించారు. జూన్ ఏడు వరకు ఈ తరగతులు నిర్వహించనున్నారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న బాల సాహిత్యం, పురాణాలు, చరిత్ర, బాల వినోదిని, బాల భారతం, భారత రాజ్యాంగం, హక్కులు, వినియోగదారుల హక్కులు, ఇంగ్లిష్ సాహిత్యం, స్వాతంత్ర్య సమయోధుల పుస్తకాలతో పాటు, పాఠ్య పుస్తకాలు చదువుతూ తమ విజ్ఞానాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. విద్యార్థులకు యోగా తరగతులను కూడా నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి కుంచే చినబాబు తెలిపారు.

వ్యవసాయంగా..

- సాగులో యువత భాగస్వామ్యానికి శిక్షణ
- పని అనుభవంతో క్షేత్ర స్థాయి పర్యటన
- పార్వతీపురం ఉద్యాన కళాశాల చేయూత



సేంద్రియ వ్యవసాయంలో వినియోగించే ద్రావణం తయారీని రైతులకు వివరిస్తున్న విద్యార్థినులు



గ్రామదర్శిని చిత్రపటంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

నల్లజర్ల: సాగు లేకుంటే గడ్డు పరిస్థితే. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ అన్నదాత ముందుకు సాగుతున్నాడు. రైతన్న అనుభవానికి యువత ఆలోచన తోడైతే.. సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానిస్తే మరింత మేలు జరుగుతుంది. ఆ కోవలోనే వ్యవసాయం (ఉద్యాన సాగు)లో యువతను భాగస్వాములను చేసే బాధ్యతను పార్వతీపురం ఉద్యాన కళాశాల స్వీకరించి శిక్షణ ఇస్తోంది. నాలుగో సంవత్సరం ఉద్యాన కోర్సు చదువుతున్న విద్యార్థులు తమ శిక్షణలో భాగంగా వివిధ ప్రాంతాలకు వచ్చారు. నాలుగు నెలల పాటు నిర్వహించే కార్యక్రమాన్ని గ్రామీణ వ్యవసాయ (ఉద్యాన) పని అనుభవంగా పిలుస్తారు. దీనికి సంబంధించిన విశేషాలను ఆ విద్యార్థులు వివరించారు.

పార్వతీపురం ఉద్యాన కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్న ఎనిమిది మందిని క్షేత్ర పర్యటన కోసం వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం వారు కేటాయించారు. ఈ నాలుగు మాసాల్లో ఉద్యాన రైతులు చేపట్టే అన్ని ఉద్యాన సాగు కార్యక్రమాలను దగ్గర నుంచి పర్యవేక్షిస్తారు. ఇందుకు నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామాన్ని వీరు ఎంచుకున్నారు. ఆ గ్రామంలో ఉద్యాన సాగులో తెగుళ్లు, కలుపు నివారణ, పురుగు మందు వినియోగం తదితర అంశాలను క్షుణ్ణంగా తెలుసుకుని, చివరకు పంట చేతికొచ్చే వరకు ఆ రైతుకు ఎంత ఖర్చయింది, ఎంత మిగిలింది పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా రైతు కుటుంబంపైన రైతుకు ఉన్న అనుబంధ పరిశ్రమలు పశు పోషణ, కోళ్ల పెంపకం తదితర అంశాలపైనా ప్రాజెక్ట్ వర్క్ చేసి, అన్ని కోణాల్లో ఆయా అంశాలపై విశ్లేషణలతో పాటు పని అనుభవాన్ని నేర్చుకుంటారు. ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తలు కరుణశ్రీ, వి.దీప్తి వీరి పనితీరును పర్యవేక్షిస్తారు.

మొదటి నెలలో..

విద్యార్థులకు కేటాయించిన గ్రామాల్లో సర్వే చేయాలి. దీనిని ఆగ్రో ఎకనమిక్ సర్వే అంటారు. శాస్త్రవేత్తలు సూచించిన విధంగా సాగు మెళకువలు రైతులు అమలు చేస్తున్నారా? లేదా? అన్న విషయాలు పరిశీలిస్తారు. రైతులు చేపట్టబోయే వ్యవసాయానికి సంబంధించిన వివరాలు సేకరించి, సాగుకు సమాయత్తం అవుతున్న తీరుపై విశ్లేషణ చేయాలి. సాగులో నూతన ఆధునిక విధానాలు పాటిస్తున్న రైతులు, వారు సాధిస్తున్న దిగుబడులపై నివేదిక తయారు చేయాలి. రైతు కుటుంబాల ఆదాయ, వ్యయాలతో పాటు, జీవన ప్రమాణాల వివరాలు సేకరిస్తారు.

రెండో నెలలో..

సాగులో తాము గ్రహించిన విషయాలతో బోర్డులు, చార్టులు తయారు చేయాలి. వీటిపై బోధనా విధానాన్ని వారే రూపొందిస్తారు. దీనిని రైతులకు అర్థమయ్యే రీతిలో నైపుణ్యతతో వివరిస్తారు.

మూడో నెలలో..

గ్రామంలో బ్యాంకులు, సహకార సంఘాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు సందర్శించి విద్యార్థులకు పోటీలు నిర్వహించాలి. బ్యాంకులు ఖాతాదారులకు అందిస్తున్న నూతన పథకాలు, సేవలు లావాదేవీలపై అధ్యయనం చేసి, పూర్తి సమాచారాన్ని సేకరించాలి. పంటలకు ఆశించే చీడపీడలతో పాటు, ఆశించిన పురుగుల నమూనాలు పరిశీలించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నూతన పథకాల అమలు, ప్రజలకు అందుతున్న తీరు క్షేత్ర స్థాయి పరిశీలన జరిపి, నివేదిక తయారు చేయాలి. మొదటి నెలలో రైతు కుటంబాల బడ్జెట్‌పై అధ్యయనం చేస్తే, వాటికి భిన్నంగా వ్యవసాయ కూలీల కుటుంబాల ఆదాయ, వ్యయాలపై విశ్లేషణ చేయాలి.

నాలుగో నెలలో..

మూడు నెలల కార్యక్రమాలపై సమగ్ర సమాచారం రూపొందించడం. మహిళలు స్వయం ఉపాధిపై అవగాహన, ఉద్యాన రైతులతో చర్చ, ఉద్యాన పంటల ప్రదర్శన కార్యక్రమాలుంటాయి.

ఎంతో ఉపయోగపడ్డాయి



ప్రకాశరావుపాలెంలో ఉద్యాన రైతులు అల్లూరి సత్యనారాయణ, దేవిన మధుబాబు అరటితోటల్లో అంతర పంట కోకో సాగుపై తెలుసుకున్నాం. అరటిలో చీడపీడలు–తెగుళ్లు, వాటి లక్షణాలు తెలుసుకున్నాం. వారి అనుభవాలు మాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

– టి.రేవతి, ఎం.ప్రియాంక

అనేక అంశాలు తెలిశాయి



రైతులు టి.సత్యనారాయణ, దేవిన నరేష్ నిమ్మ, కొబ్బరి, మామిడితోటల్లో చేస్తున్న సేంద్రియ సాగు, నిమ్మలో వచ్చే తెగుళ్లు, వాటి నివారణను తెలుసుకున్నాం, జీడితోటల్లో పరపరాగ సంపర్కం కాకుండా ఎరలను ఏర్పాటు చేయడం వంటి అంశాలు తెలుసుకున్నాం.

– ఎం.నవ్యలక్ష్మి, పి.మౌనిక

తెగుళ్లపై అవగాహన



రైతు దావులూరి శ్రీనివాసరావు ఆయిల్‌పామ్‌తోట, మద్దిపాటి వెంకటేశ్వరావు కోకో, అరటిల్లో ఆశించే తెగుళ్లు, వాటి నివారణ తెలుసుకున్నాం.

– ఏ.పూర్ణసాయిశ్రీ, వి.నాగవైష్ణవి

ఈదురు గాలులతో భారీ వర్షం



నల్లజర్ల చెక్ పోస్టు సెంటర్‌లో జలమయమైన రహదారి



బ్రాహ్మణగూడెంలో ఈదురు గాలులకు ఊగుతున్న కొబ్బరి చెట్లు

చాగల్లు: నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల రహదారులు జలమయమయ్యాయి. ముందుజాగ్రత్తగా పట్టణాలతో పాటు, అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జనజీవనం స్తంభించింది. చాగల్లు మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. వేసవి తీవ్రతతో తల్లడిల్లిన ప్రజలు కాస్తంత ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో.. ఎండ వేడిమిని జనం తట్టుకోలేకపోయారు. వర్షం కారణంగా వారంతా సేద తీరారు. చాగల్లు, బ్రాహ్మణగూడెం, ఊనగట్ల, ఎస్ ముప్పవరం, దారవరం, మార్కొండపాడుతో పాటు, పలు గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షం కురిసింది. చిక్కాల, కలవలపల్లి తదితర ప్రాంతాల్లో మామిడి కాయలు నేలరాలాయి. అరటితోటలు నేలకొరిగాయి.

జలమయమైన రహదారులు

నల్లజర్ల: మండల కేంద్రమైన నల్లజర్లతో పాటు, వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజా జీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షంతో పాటు ఈదురు గాలులూ వీయడంతో అక్కడక్కడా మామిడి కాయలు నేలరాలాయి. కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, ఉద్యాన సాగుకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.

ఉపశమనం కలిగించిన వర్షం

నిడదవోలు: అడపాదడపా కురిసిన వర్షాలకు నిడదవోలు, పరిసర ప్రాంతాల ప్రజలు ఉపశమనం పొందారు. మూడు రోజులుగా సాయంత్రం వేళ ఉన్నట్టుండి వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు.. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములతో కూడిన వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది.

పలు గ్రామాల్లో భారీ వర్షం

నిడదవోలు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. వర్ష ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సమిశ్రగూడెం, డి.ముప్పవరం, గోపవరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. వర్షంతో పాటు ఈదురుగాలుల ప్రభావంతో ఉదయం నుంచే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి ఏడు గంటలకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ముద్రగడతో వైఎస్సార్ సీపీ కాపు నేతల భేటీ



కిర్లంపూడిలో ముద్రగడను కలిసిన తోట రామకృష్ణ తదితరులు

తాళ్లపూడి: మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభంతో పలువురు పార్టీ ప్రముఖ కాపు నేతలు కిర్లంపూడిలో సోమవారం భేటీ అయ్యారు. పార్టీ తూర్పు గోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డు మెంబర్ చిట్టూరి అన్నవరం, కొవ్వూరు ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగబాబు, తాళ్లపూడి మండల కాపు సంఘ అధ్యక్షుడు నామ ప్రకాశం తదితర నాయకులు.. ముద్రగడ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రాష్ట్రంలో మరో దఫా వైఎస్సార్ సీపీ విజయ కేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ తొమ్మిదిన ప్రమాణ స్వీకారం కూడా చేస్తారన్నారు. పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసిన తోట రామకృష్ణను ముద్రగడ పద్మనాభం అభినందించారు.

ఆత్మీయ వేడుక.. అనుభూతుల వేదిక

22 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



తాడిమళ్ల జెడ్పీ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిడదవోలు రూరల్: ఒకే బడిలో చదివి. విడిపోయిన ఆ విద్యార్థులంతా 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. నిడదవోలు మండలంలోని తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–2002 బ్యాచ్‌కు చెందిన వారంతా కలిసి సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం అందరూ కలిసి విందు భోజనం చేశారు. పూర్వ విద్యార్థులు కాగిత సత్తిపండు, లక్ష్మణ్, దుర్గారావు, తాతా రాఘవ, కె.నాగరాజు, వలీఅహ్మద్, స్వరాజ్యలక్ష్మి, సరోజ, స్వాతి తదితరులు పర్యవేక్షించారు.

అన్న సమారాధన

చాగల్లు: కల్యాణోత్సవాల ముగింపులో భాగంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్న సమారాధన జరిగింది. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జూదరుల అరెస్టు

నిడదవోలు రూరల్: శంకరాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. వీరి వద్ద రూ.1,200 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ఇంద్రజాలంతో మాయ చేయవచ్చు

పెరవలి: ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చూపించడమే ఇంద్రజాలమని, ఏకాగ్రతతో అభ్యసిస్తే ప్రతి ఒక్కరూ ఇంద్రజాలికులు కావచ్చని ప్రముఖ సైకాలజిస్ట్, ఇంద్రజాలకుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బీఎం గోపాలరెడ్డి తెలిపారు. కానూరు రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో శారదా నివేదిత బాల వికాస్ భవనంలో చంపాటి వరప్రసాద్ ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా జరుగుతున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంద్రజాలంలో స్నేహితులు, సోషల్ మీడియా అలవాట్లు, చెట్ల ప్రాధాన్యం, లక్ష్యం, దేశభక్తి తదితర విషయాలను మ్యాజిక్‌తో వివరించారు.

బంగారమ్మపేటలో కార్డన్ అండ్ సెర్చ్



బంగారమ్మపేటలో మోహరించిన పోలీసు బలగాలు

కొవ్వూరు: వాడపల్లి శివారు గ్రామమైన బంగారమ్మపేటలో సోమవారం తెల్లవారుజామున 4.30 నుంచి ఉదయం ఏడున్నర వరకూ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటినీ జల్లెడ పట్టారు. ఏ విధమైన రికార్డుల్లేని ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా గ్రామంలో ఉన్నారా అని ఆరా తీశారు. గ్రామంలో అనుమానితులు ఎవరు దొరకలేదన్నారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, రూరల్, పట్టణ ఎస్సైలు కె.సుధాకర్, ఎండీ జుబేర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాల పట్టివేత

గోపాలపురం: పోలీసు బలగాలు సోమవారం గోపాలపురం పెద్దగూడెంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించినట్టు దేవరపల్లి సీఐ కె.బాలసురేష్ చెప్పారు. రికార్డులు లేని నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో కానీ, ఇతర చిల్లర వ్యాపారులు కానీ బాటిళ్లలో డీజిల్, పెట్రోల్ అమ్మకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ ఎటువంటి బాణసంచా కాల్పులు జరపరాదని సీఐ తెలిపారు. గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం

- పోటెత్తిన భక్తులు
- దర్శనానికి గంట సమయం
- భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ ఘట్టం

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు రెండో రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. వైశాఖ మాసం సోమవారం వందలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. తెల్లవారుజాము 4 గంటల నుంచే భక్తులు అధిక సంఖ్యలో వచ్చినా, 6 గంటల నుంచి క్యూలైన్‌లో ఆలయ ప్రాంగణం చుట్టూ నిలబడటంతో దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చిన్న పిల్లలకు ఉచితంగా పాలు, దాతల సహకారంతో ఉచిత ప్రసాదం చక్కెర పొంగలి, లడ్డూ పంపిణీ చేశారు. తలనీలాలు సమర్పించడానికి వచ్చిన వందలాది మంది భక్తులు క్యూలైన్‌లో వేచిఉండాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయాలు భక్తులతో కళకళలాడాయి. భక్తులందరికీ ఉదయం, సాయంత్రం ఉచిత అన్న సమారాధన నిర్వహించారు. ఈ ఒక్కరోజే 4 వేల మంది స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

శ్రీలక్ష్మీ యాగం

ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీ యాగాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ యాగం వల్ల స్వామి అమ్మవార్లకు ఎంతో శక్తి వస్తుందని, దీనిని ప్రతి భక్తులు గ్రహించాలని పండితులు తెలిపారు.

ఘనంగా కల్యాణం

నిత్య కల్యాణ శ్రీనివాసుడికి అలివేలు మంగ, పద్మావతి సమేతంగా సోమవారం రాత్రి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం ఇక్కడకు తెచ్చి స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వేద మంత్రాల నడుమ జరిగిన ఈ కల్యాణం తిలకించి భక్తులు పరవశించిపోయారు.